క్లుప్తంగా

ధర్మకర్త మండలికి దరఖాస్తు చేసుకోండి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవస్థాన ధర్మకర్త మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. నేమకల్లు ఆలయంకు దాదాపు ఆరేళ్లుగా నోటిఫికేషన్ విడుదల కాలేదు. దీంతో పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల ఆలయం ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. దరఖాస్తుదారుడికి 30 ఏళ్లు పైబడి ఉండాలని, ఇరవై రోజుల్లో దేవదాయశాఖ అధికారికి దరఖాస్తులు అందించాలని ఈఓ తెలిపారు.

యువతతోనే దేశాభివృద్ధి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

కూడేరు: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ జోబె పిలిప్ అన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 9 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో కర్నూల్, అనంతపురం జిల్లాలకు చెందిన క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. గురువారం ఎన్‌సీసీ అధికారులు, కాడెట్లు అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. క్యాంప్ కమాండర్ కల్నల్ జోబె పిలిప్ మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. ఎన్‌సీసీ అధికారులు శ్రీప్రియ, ఎర్రెమ్మ, సోమశేఖర్ నాయుడు, కునింధర్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యల పట్టని వ్యవసాయాధికారులు

కుందుర్పి: మండలంలో రైతుల సమస్యలను వ్యవసాయాధికారులు పట్టించుకోలేదని రైతులు గోపాల్, రామాంజి, తిప్పేస్వామి, హరికృష్ణ తదితరులు అన్నారు. జంబుగుంపల పంచాయతీలో 45 మంది రైతులకు ఎంపీఈఓ మల్లేశ్వరి ఈకేవైసీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించ లేదని బాధిత రైతులు పాలమ్మ, అంజనమ్మ, ఈరన్న, రామాంజనేయులు తదితరులు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ మహేష్ కనేకల్లు బదిలీకాగా ఏఈఓ విజయకుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. మండలంలో ఇన్‌చార్జ్ ఏఓ అందుబాటులో ఉండడంలేదని రైతులు అంటున్నారు.

శుభకార్యం



వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు , వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని మద్దానేశ్వర స్వామి కళ్యాణమంటపంలో 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ శ్రీలక్ష్మి, తిమ్మరాజు దంపతుల కుమార్తె హర్షిత వివాహం జయకృష్ణతో గురువారం జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులు వధూవరులను ఆశీర్వదించారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

బొమ్మనహాళ్: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ నబీరసూల్, ట్రైనీ ఎస్ఐ నవీన్‌కుమార్ సిబ్బంది గురువారం వాహనాలను తనిఖీలు ముమ్మరం చేశారు. హెల్మెట్ లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై జరిమానాలు విధించారు. మైనర్లు వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నబీ రసూల్ హెచ్చరించారు. బయటకు వచ్చినప్పుడు రికార్డులు తప్పకుండా వెంట తెచ్చుకోవాలన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ అన్నారు.

వర్షపునీటితో అవస్థలు



మధు టాకీస్ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మధు టాకీస్‌కు వెళ్లే దారిలో దాదాపు వారంరోజుల నుంచి వర్షపు నీటి నిల్వతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు వెళ్లే మార్గం లేక వర్షపునీరు, బురదలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దాదాపు 400 మీటర్ల మేర ఈ నెల 6 నుంచి వర్షపునీరు పేరుకుపోయింది.

ఆలయ గోపుర కలశం వితరణ



గర్భగుడి గోపుర కలశాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు: పార్వతీ పరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర ఆలయ గర్భగుడి గోపుర కలశాన్ని కురుబ రామాంజనేయులు గురువారం వితరణ చేశారు. సుమారు రూ.50 వేలతో పంచలోహాలతో కలశాన్ని తయారు చేసినట్లు రామాంజనేయులు తెలిపారు. కోరిన కోర్కె తీరడంతో మొక్కుగా కలశాన్ని ఇచ్చినట్లు తెలిపారు. తొలుత గ్రామవీధుల్లో కలశాన్ని ట్రాక్టర్లలో ఉంచి ఊరేగించారు. అనంతరం ఆలయ అర్చకులకు అందజేశారు.

దమ్ము ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల యజమానులు
- పట్టించుకోని అధికారులు



ఉద్దేహాళ్‌లో సీసీ రోడ్డుపై ప్రయాణిస్తున్న దమ్ము చక్రాల ట్రాక్టర్



కళ్యాణదుర్గం-బళ్లారి రహదారిపై వెళ్తున్న దమ్ము చక్రాల ట్రాక్టర్

బొమ్మనహాళ్: నియోజకవర్గంలో అసలే అంతంత మాత్రంగా ఉన్న గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటల సాగు సమయంలో దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై వెళ్తుండడంతో ఛిద్రమవుతున్నాయి. అయినా రహదారులకు సంబంధించిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు కానీ, పోలీస్ విభాగం కాని చర్యలు తీసుకోలేదు.

నియోజకవర్గ గ్రామాల్లో రబీ సీజన్ పూర్తి కావడంలో ఖరీఫ్ పనులు ప్రారంభించిన రైతులు.. పొలాల్లో పంట దమ్ములు చేసుకుంటున్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల గ్రామాల్లో సుమారు 850 ట్రాక్టర్లు ఉన్నాయి. దమ్ము చేసే సమయంలో ఈ ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి, పొలాల్లో దమ్ము చేస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు ఇనుప చక్రాలతోనే రోడ్లపై తిరుగుతుండడంతో రూ.లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, తారు రోడ్లు ధ్వంసమవుతున్నాయి. దమ్ము చక్రాలతో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా ట్రాక్టర్ యజమానులు లెక్కచేయడంలేదు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేసినా ట్రాక్టర్ యజమానుల్లో సర్పంచ్‌లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామ పెద్దలు ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సాహసించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

టైర్లు మార్చుకోవాలి..



ట్రాక్టరు యజమానులు దమ్ము చేసేందుకు ఒక పొలం నుంచి మరో పొలం వెళ్లేందుకు టైరు చక్రాలు మార్చుకొని వెళ్లాలి. తప్పనిసరి పరిస్థితుల్లో దమ్ము చక్రాలకు ఇనుక బెల్టులు ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయంపై అధికారులు ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలి.

– విశ్వనాథ్‌రెడ్డి, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

రహదారుల ధ్వంసం



గ్రామాల్లో ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేస్తూ రహదారులను నిర్మిస్తోంది. అయితే వాటిపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు ప్రయాణించడంతో త్వరితగతిన శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా తయారవుతున్నాయి. అధికారులు పంట దమ్ములు పూర్తయ్యే వరకూ రహదారులపై వాటిని అనుమతించకూడదు.

– ఆంజనేయులు, సిద్దరాంపురం

చర్యలు తీసుకుంటాం



దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు వెళ్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

– నబీరసూల్, బొమ్మనహాళ్ ఎస్ఐ

ప్రజలందరికీ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు



మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాయదుర్గం: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా నియోజకర్గంలోని ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు తన క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పార్టీ నాయకులు, మున్సిపల్ పాలక పక్షం, వివిధ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

జెండా ఆవిష్కరణ అనంతరం శుక్రవారం 10 గంటలకు పట్టణ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మెట్టు తెలిపారు. సమావేశానికి ఐదు మండలాల్లోనూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో .. బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ ఉంటుందన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



అలంకరణలో ఆంజనేయస్వామి ,సీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణాన్ని ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు కమనీయంగా నిర్వహించారు. వేకువజామున ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, పుష్పాలతో నిమ్మకాయలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతాముల విగ్రహాలను పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తైగా ప్రత్యేకంగా అలంకరించి, కొలువు తీర్చారు. వేద మంత్రాల మధ్య స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చక పండితులు కనుల పండువలా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రజితకు అరబ్ ఎమిరేట్స్ సంస్థ ప్రశంస



జిల్లా కేంద్రంలో అవార్డు అందుకుంటున్న రజిత

కుందుర్పి: మండలంలోని జంబుగుంపలకు చెందిన వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి కుమార్తె రజిత ఐన్‌స్టీన్ వరల్డ్ రికార్డ్స్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంస్థ ప్రశంసాపత్రం, నగదుతో సత్కరించింది. గురువారం సంస్థ ప్రతినిధులు జిల్లా కేంద్రంలో ప్రశంసాపత్రం అందించారు. దేశ వ్యాప్తంగా ఈనెల 11,12,13 తేదీల్లో 15718 మంది రిజిష్టర్డ్ నర్సింగ్ నిపుణులు 254 మందితో అసోసియేషన్ ఆఫ్ నర్స్ ఎగ్జిక్యూటివ్ (ఇండియా)వారిచే సర్వేలు చేశారు. ఈ సర్వేలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించారు.

దాడిలో వ్యక్తికి గాయాలు

కుందుర్పి: మండల కేంద్రానికి చెందిన మాల పెన్నోబులేసుపై ఎలుగుబంటి దాడి చేసింది. గురువారం మధ్యాహ్నం సీతాఫలాలు కోయడానికి సమీపంలోని పొలాల్లోకి వెళ్లిన సమయంలో చెట్ల పొదల మాటు నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. పెన్నోబులేసు గట్టిగా కేకలు పెట్టడంతో చుట్టపక్కల రైతులు కర్రలతో వచ్చి ఎలుగు బంటిని అదిలించారు. తీవ్రంగా గాయపడిన పెన్నోబులేసును జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించారు.

సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

కణేకల్లు: కణేకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (సొసైటీ) అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్‌గా గురువారం నాగార్జున ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, డైరెక్టర్ చాంద్‌బాషా, మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజ్, మాజీ వైస్ ఎంపీపీ మాబుసాబ్, ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- వరుస చోరీలు..జనం బెంబేలు
- రెండువారాల వ్యవధిలో ఆరు దొంగతనాలు



ఇటీవల నూతన రైల్వే క్వార్టర్స్‌లో చోరీ జరిగిన ఇంట్లోని గదిలో చిందరగా పడేసిన వస్తువులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే ఆరు దొంగతనాలు జరిగాయి. తాళం వేసి పెళ్లిళ్లు, శుభకార్యాలు, విహారయాత్రలకు వెళ్లిన ఇళ్లనే టార్గెట్ చేసి బీరువాలను పగలగొట్టి విలువైన బంగారు ఆభరణాలు, నగదు దోపిడీకి పాల్పడుతున్నారు. రాయదుర్గం పట్టణం కర్ణాటక సరిహద్దుకు కేవలం 11 కిలో మీటర్ల దూరంలోనే ఉండడంతో దొంగతనాల్లో ఆరితేరిన వారే అక్కడి నుంచి వచ్చి చాకచక్యంగా చోరీలు చేసి వెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో జనం బెంబేలెత్తుతున్నారు.

- రెండు వారాల వ్యవధిలో ఆరు దొంగతనాలు :
- పట్టణంలోని గాంధీ స్కూల్ ఏరియాలో నివాసం ఉంటున్న బాధితుడు శ్రీనివాసులు ఇంట్లో జూలై 27న చోరీ జరిగింది. దాదాపు రూ.25 వేల నగదు, ఒక ఎల్ఈడీ టీవీ ఎత్తుకెళ్లారు.
- పట్టణంలోని నూతన రైల్వే క్వార్టర్స్‌లో రైల్వే టీఆర్‌డీ వర్కర్‌గా పని చేస్తున్న నాగేంద్ర ఇంట్లో ఆగస్టు 1న గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.5 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీ చేశారు.
- ఆగస్టు 2న కణేకల్లులో రోడ్డులోని అశోక్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో రూ.15 వేలు విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. దుకాణం వెనుక వైపు షెడ్డు రేకులను కట్ చేసి, చోరీ చేశారు.
- పట్టణంలోని సీతప్ప మిల్లు ఎదురు వీధిలోని రెండిళ్లలో ఆగస్టు 8న అర్ధరాత్రి చోరీ జరిగింది. తాళం వేసి శుభకార్యాలకు వెళ్లిన వీరి ఇంటి తాళాలు పెకిలించి, దొంగతనం చేశారు. బాధితురాలు రామంజనమ్మ ఇంట్లో రూ.37 వేలు నగదు, 15 గ్రాముల బంగారు సొత్తు చోరీ చేశారు. మరో బాధితురాలు గంగమ్మ ఇంట్లోనూ చోరీ జరిగింది.
- పట్టణంలోని సత్యనారాయణస్వామి గుడి సమీపంలో వడ్డే అశోక్ అనే వ్యక్తి ఇంట్లో గత సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ప్రవేశించి, బీరువా తాళం పెకిలించి అందులో ఉన్న రూ.1.50 బంగారు సొత్తును అపహరించారు.

అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు



ప్రజల సహకారంతో చోరీలు అరికట్టేందుకు క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాం. రాత్రి గస్తీ బీట్‌లను పెంచాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇంటికి తాళాలు వేసి, ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బంగారు ఆభరణాలు, నగదు ఉంటే సొంత మనుషులకు అప్పగించి, వెళ్లాలి. వార్డుల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అవసరమైన చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు చేసి, నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– జయానాయక్, సీఐ రాయదుర్గం అర్బన్ పీఎస్

ప్రతి ఒక్కరికీ దేశభక్తి ఉండాలి



జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్క పౌరుడికీ దేశభక్తి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ హర్షలత తెలిపారు. గురువారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి, టీసర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

కూడేరు: ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిరంజీవి రెడ్డి అన్నారు. గురువారం కూడేరులో బీజేపీ నేతలు, హైస్కూలు విద్యార్థులు , ఉపాధ్యాయులు కలిసి గ్రామ వీధుల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజ్, జనసేన అధ్యక్షుడు నాగేష్, నేతలు ఆంజనేయులు, శ్రీనివాసులు, మల్లికార్జున, సుధాకర్ బాబు, ఓబులేసు, వెంకటేష్ నాయక్ రాము పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు పూర్తి

గుమ్మఘట్ట: ఆగస్టు 15కు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ రజాక్‌వలి,ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణాల్లో జెండా ఆవిష్కరణ, గౌరవ వందనం స్వీకరణ, జాతీయ గీతాలాపన తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

పదిలో ప్రతిభావంతురాలికి నగదు బహుమతి



నగదు,నిఘంటువులు అందిస్తున్న పూర్వ విద్యార్థి బొమ్మలింగప్ప

కుందుర్పి: అప్పిలేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన శిరీష అనే విద్యార్థినికి బొమ్మలింగ అనే పూర్వ విద్యార్థి నిఘంటువులు, నగదు అందించి అభినందించారు. పాఠశాల హెచ్ఎం బీసీ తిమ్మప్పకు అందించి, గణతంత్ర వేడుకల్లో శిరీషకు అందజేయాలని సూచించారు. గ్రామానికి చెందిన చిరంజీవి రూ.3వేలు, అతావుల్లా రూ.1500 అందజేసినట్లు హెచ్ఎం తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు హర్షద్

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామానికి చెందిన హర్షద్ (17) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన హుస్సేన్, షాహినా దంపతుల కుమారుడు హర్షద్ కర్ణాటకలోని బట్రల్లికి వెళ్లి బుధవారం రాత్రి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా, కోనసాగరం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని సమీపంలోని రాంపుర ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కర్ణాటక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధినేతను కలిసిన మెట్టు విశ్వ



వైఎస్ జగన్‌తో విశ్వనాథ్‌రెడ్డి

రాయదుర్గం:వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అనంతపురంలోని హెలిప్యాడ్ వద్ద గురువారం కలిశారు. ఈ సందర్భంగా రాయదుర్గం రాజకీయ పరిస్థితులపై మాజీ సీఎం జగన్ విశ్వను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు

కూడేరు: కూడేరు పోలీసు స్టేషన్ సమీపాన గురువారం అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉరవకొండ మండలం మెరిమెట్లకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సురేష్, పరమేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్ కుమార్ రెడ్డి వివాహ వేడుకకు హాజరై, ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా ఘటనా స్థలికి రాగానే అనంతపురం వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. క్షతగాత్రులను అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.